క్లుప్తంగా

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏవో వరలక్ష్మి

ఐరాల: వ్యవసాయ రంగంలో రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి లాభసాటిగా మార్చడమే ధ్యేయమని ఏవో వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ఆర్ఎస్కేలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రతి పథకం లబ్ధి అందేలా అవగాహన కల్పించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పంట పొలాలను ఆశించే చీడపీడలు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది పంట సాగు చేయాలని సూచించారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

ముట్టుకూరులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వృద్ధులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

తవణంపల్లె: మండలంలోని ముట్టుకూరులో వైద్యబృందం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేయించారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేయించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తయిన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



స్తంభాన్ని మారుస్తున్న సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని కట్టమంచి చెరువు వద్ద ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వినాయక చవితి సందర్భంగా నగరం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ప్రతిమలను అధిక సంఖ్యలో ఇక్కడ క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఇక్కడ ఉన్న 9.1 మీటర్ల విద్యుత్‌స్తంభాల స్థానంలో 11 మీటర్ల స్తంభాలను రెండింటిని గురువారం బిగించారు. ముందు జాగ్రత్త చర్యలు భాగంగా వాటిని పెట్టామని ఏఈ రాము తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల నృత్య ప్రదర్శనలు

కాణిపాకం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆస్థాన మండపంలో గురువారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కళాకారులు అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చారు. భరతనాట్యం, కూచిపూడి నాట్యం, భక్తి గీతాలపాలనతో అలరించారు. అలాగే కోలాటాలు, పలు రకాల డప్పువాయిద్యాల ధ్వనులతో ఆలయ ఆవరణ పండుగ వాతావరణం నెలకొంది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పుష్పకావళ్లతో భక్తుల ఊరేగింపు



పుష్పకావళ్లతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కాణిపాకం: చవితిని పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి భక్తులు పుష్పకావళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కోనేరులో కావళ్లకు అభిషేకం చేయించారు. తర్వాత పెరుమాళ్ల స్వామి ఆలయంలో కావళ్లను అలంకరించుకున్నారు. అనంతరం వందలాది మంది భక్తులు డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి సన్నిధిలో కావళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. కాగా కాణిపాకం గ్రామస్తులు వారం రోజుల పాటు దీక్షలు చేపట్టి కావళ్లతో ఏటా మొక్కులు తీర్చుకోవడం ఆనాయితీ.

ఇదేం విడ్డూరం..?

- 25 పోస్టుల సరెండర్‌కు ప్రతిపాదనలు
- వాటికి బదులుగా 16 పోస్టులు చాలని నివేదన
- కొత్త పోస్టులు సాధించలేక.. ఉన్న వాటిని అప్పగింత
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వింత పోకడ



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడిగా పాతుకుపోయిన ఉద్దండుల్లో కొందరికి బయటకు వెళ్లకుండా.. ఇక్కడే ఉద్యోగ విరమణ చేసేయాలనే కోరిక పుట్టింది. కార్పొరేషన్లు అన్నింటినీ ఒక్కటిగా చేసే యూనిఫైడ్ సర్వీసెస్ ఇప్పట్లో రాదనుకుని.. అంతలోపు తమ కడుపులు నిండితే చాలనుకున్నారు. ఫలితంగా కార్పొరేషన్‌లో ఉన్న 25 పోస్టులను ప్రభుత్వానికి అప్పగించేసి, తమకు కావాల్సిన పోస్టుల మంజూరుకు ఫైలు సిద్ధం చేశారు. దీనిపై సాటి ఉద్యోగులే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ పోస్టులతో నష్టమేంటి?

2012లో చిత్తూరు మున్సిపాలిటీస్థాయి నుంచి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. కార్పొరేషన్ అయ్యాక ఇక్కడ అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సూపరింటెండెంట్, యూడీ ఆర్ఐ, సీనియర్ స్టెనోగ్రాఫర్ లాంటి దాదాపు 20కి పైగా పోస్టులు మంజూరు కావాలి. వీటిని సాధించుకోవడంలో ఉద్యోగ సంఘాలు విఫలమయ్యాయనే చెప్పాలి. కార్పొరేషన్ స్థాయికి తగ్గట్టు పోస్టులను మంజూరు చేసేలా ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే ఏదైనా ప్రయోజనం ఉంటుంది. కానీ చిత్తూరు మున్సిపాలిటీగా ఉన్న సమయంలో మంజూరైన అకౌంటెండ్, టైపిస్టు, క్లీనర్, మెటర్నటీ అసిస్టెంట్, మహిళా వైద్యాధికారి, వాచ్‌మెన్, ఆయా లాంటి దాదాపు 25 పోస్టులు తమకు వద్దంటూ ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. దీనికి బదులుగా సూపరింటెండెంట్ పోస్టులు 7, సీనియర్ అసిస్టెంట్ 8, యూడీ ఆర్ఐ ఒకటి చొప్పున మంజూరు చేస్తే చాలంటూ ఫైలు సిద్ధం చేశారు. శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని పాలకవర్గం ముందు ఉంచారు. కొత్త పోస్టులు సాధించుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదు.. కానీ ఉన్న వాటిని ఒక్కసారి ప్రభుత్వానికి సరెండర్ చేస్తే, వాటి ఊసు ఎత్తే అవకాశమే ఉండదని అధికారులు మరచిపోతున్నారు. కనీసం ప్రభుత్వం కొత్త పోస్టులు మంజూరు చేసిన తరువాత కూడా ఇక్కడ ఏదైతే వద్దనుకుంటున్నారో ఆ పోస్టులపై నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనే వాదన వినిపిస్తోంది. దీనిపై కనీసం ఉద్యోగ సంఘాల నేతలు అందరితో చర్చించకుండా ఫైలును కౌన్సిల్ ముందు ఉంచడంపై విమర్శలు వస్తున్నాయి.

నష్టమేనా..?

పాత పోస్టులను సరెండర్ చేయడంతో ఉద్యోగులకు కచ్చితంగా నష్టమే జరుగుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా ప్రజారోగ్యశాఖ, ఇంజినీరింగ్ విభాగాల్లో నాలుగో తరగతి ఉద్యోగులుగా పనిచేస్తూ ఎవరైనా చనిపోతే.. కారుణ్య నియామకం కింద స్వీపర్, గ్యాంగ్‌మెన్ పోస్టులే ఇస్తున్నారు. కానీ ఇక్కడున్న టైపిస్టు, క్లీనర్, మెటర్నటీ అసిస్టెంట్ లాంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయనే విషయం కూడా చెప్పడం లేదు. రికార్డు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయకూడదని చెప్పిన అధికారులే, ఇటీవల కారుణ్య నియామకంలో ఒకరికి అదే పోస్టు ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వడం వివాదాస్పదమైంది. ఏకంగా రాష్ట్ర మున్సిపల్ పరిపాలన (డీఎంఏ) అధికారులకే ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇలాంటి తరుణంలో అనుమతి ఉన్న పోస్టులను కారుణ్య నియామకాలకు ఉపయోగించుకుని, కొత్త పోస్టులను సాధించుకోవడంపై యంత్రాంగం దృష్టి పెడితే బాగుంటుందనే వాదన వినిపిస్తోంది. దీనిపై పాలకులు, ప్రజాప్రతినిధులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

మాజీమంత్రి పెద్దిరెడ్డితో భేటీ



మాజీ మంత్రి పెద్దిరెడ్డితో మాజీ ఎమ్మెల్యే సునీల్, నేతలు

పూతలపట్టు(యాదమరి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పూతలపట్టు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఉదయం తిరుపతిలోని ఆయన స్వగృహం వద్ద మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డితో కలిసి పెద్దిరెడ్డిని కలిసి పలు విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై పెద్దిరెడ్డితో చర్చించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని మాజీమంత్రి పెద్దిరెడ్డికి వారికి సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ నేతలు బోగస్ ఓటర్లను జాబితాలో చేర్చే అవకాశం ఉందని, బీఎల్ఏలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈనెల చివరి నాటికి ఓటర్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మేయర్ అముద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగే సమావేశానికి కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్- అఫీషియో సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

శిశుసంరక్షణ ఆరోగ్య సేవలపై శిక్షణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం శిశుసంరక్షణ ఆరోగ్యసేవలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, స్టాఫ్‌నర్సులు హాజరయ్యారు. గర్భస్థ నమోదు, బాలింతల సేవలు, శిశు సంరక్షణ సేవలను యాప్‌లో ఏవిధంగా నమోదు చేయాలో జిల్లా క్షయ నివారణ అధికారి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్‌కుమార్, అనూష, జార్జ్, రోజారాణి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

చిత్తూరు రూరల్(కాణిపాకం): భూ విషయంలో తమకు న్యాయం చేయాలని నగరానికి సంధ్య అనే మహిళ రెవెన్యూ అధికారులను కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులను కలిసి భూ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. మురకంబట్టు ప్రాంతంలో తమకు 90 సెంట్ల భూమి ఉందన్నారు. అందుకు సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయన్నారు. గుడిపేరుతో తప్పిదారి పట్టిస్తున్నారని, దీనిపై ప్రజాపరిష్కార వేదికలో కూడా అర్జీ ఇచ్చుకున్నామని ఆమె విన్నవించారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటుదాం



మొక్కలు నాటుతున్న వైద్యాధికారి రెడ్డెప్ప, సిబ్బంది

ఐరాల: పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఐ లవ్ ఐరాల కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ ఆవరణలో సిబ్బంది చేతుల మీదుగా అరటి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో అవసరమైన ఆక్సిజన్ కోసం డబ్బు ఖర్చు చేయాల్సిన పరిస్థితిని గుర్తు చేశారు. మళ్లీ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అందరూ బాధ్యతగా పర్యావరణ రక్షణకు పాటుపడాలన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో 500 అడుగుల మేర త్వరలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో బీపీ, షుగర్, ఆస్తమా, ఊబకాయం వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. అలాగే ఆయుష్ కేంద్రం ద్వారా ఉదయం ధ్యానం, యోగాపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డెంటల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ మునిరత్నం పాల్గొన్నారు.

డిప్యూటీ రిజిస్ట్రార్‌కు అభినందనలు



ఉద్యోగోన్నతి పొందిన వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఈ మధుసూదన్

చిత్తూరు కలెక్టరేట్ : కోఆపరేటివ్ శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి పొందిన సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణకు ఆ శాఖ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. జిల్లా సమగ్రశిక్ష శాఖ కార్యాలయంలో గురువారం ఆ శాఖ ఉద్యోగులు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించి ప్రస్తుతం కో ఆపరేటివ్ శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా మదిపట్ల వెంకటరమణ ఎదగడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనను ఆ శాఖ ఉద్యోగులు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఈఈ మధుసూదన్, సమగ్రశిక్ష శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మనకొద్దు ఈ మోసాల ప్రభుత్వం



క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో నాయకులు, ప్రజాప్రతినిధులు

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీలో వైఎస్సార్‌సీపీ నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మనకొద్దు ఈ మాయల..మోసాల ప్రభుత్వం అని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. చిత్తూరు మండలం పచ్చనపల్లిలో సర్పంచ్ హంస, నాయకులు స్టాండ్లీ, గురుమూర్తి ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం అమాయక ప్రజలను బుట్టలో వేసుకుందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మాట మార్చి మాయ చేస్తోందన్నారు. ఇదే మాదిరిగానే 2014 ఎన్నికల్లో గెలిచాక రుణమాఫీ, పసుపుకుంకుమ అంటూ మోసం చేసిందన్నారు. మళ్లీ అదే రీతిలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. దీనికి తోడు సంక్షేమ పథకాల్లో కోతలు పెడుతోందని.. అమ్మఒడి అరకొరగా అమలు చేసిందన్నారు. ఉచిత గ్యాస్ తుస్సుమందన్నారు. స్త్రీ శక్తి పథకంలో కోతలు పెట్టిందన్నారు. కరెంటు కష్టాలు అంత ఇంతా కాదన్నారు. కరెంటు బిల్లు ముట్టుకుంటే షాక్ కొడుతోందని తెలిపారు. ఇప్పుడు జాలి, దయ లేకుండా దివ్యాంగుల పింఛన్లపై అడ్డగోలుగా కోత విధించిందన్నారు. నిరుదోగ్య భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు. పలు శాఖల్లో పోస్టులు పేరుకు పోతున్నాయని, వాటిని భర్తీ చేయడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. కేవలం ప్రచార ఆర్భాటానికే సమయం వెచ్చిస్తోందన్నారు. కుట్రపూరితమైన రాజకీయాలకు మాత్రం ఆజ్యం పోస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, ఎంపీపీ భర్త సంపత్, ఎంపీటీసీ శోభి, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కన్నన్, వేలుస్వామి, శేఖర్, పాండియన్, దిలీప్, శేఖర్, సాము, ప్రసాద్‌నాయుడు, నాగరాజుమందడి తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యా.. దీవించయ్యా..



వేపమానువీధిలో కొలువుదీరిన ధర్మయాత్రలో వినాయకుడు



మిట్టూరులో స్వామివారిని దర్శించుకుంటున్న విజయానందరెడ్డి

- ఊరురా కొలువుదీరిన గణనాథుడు
- కొనసాగుతున్న విశేష పూజలు
- గణేశుడి నామస్మరణలతో మార్మోగిన మండపాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వినాయకచవితి సంబరాలు మిన్నంటాయి. ఊరురా వినాయకుడు కొలువుదీరాడు. మండపాల్లో కనువిందు చేశాడు. భక్తులతో విశేషపూజలందుకున్నాడు. గణనామస్మరణతో మండపాలు మార్మోగాయి. గణనాథున్ని మనసారా వేడుకున్నారు. చిత్తూరు నగరంలోని బుధ, గురువారాల్లో వినాయచవితిని వేడుకగా నిర్వహించారు. మంచి ముహూర్తంలో చవితిని ప్రారంభించి విశేష పూజలు చేశారు. రెండో రోజు కూడా స్వామివారు విశేష పూజలు అందుకున్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు గణపతికి పూజలు చేసి వేడుకున్నారు. ప్రధానంగా డీఏ రోడ్డులో ఐదు భారీ విగ్రహాలను ప్రతిష్టించారు. తెర తొలగించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ విగ్రహాలను తిలకించేందుకు చిత్తూరు నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలించ్చారు. అలాగే సంతపేట, తోటపాళ్యం, కొంగారెడ్డిపల్లి, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, మురకంబట్టు, దొడ్డిపల్లి, వేపమానువీధి, మిట్టూరు, గుర్రప్పనాయుడువీధి, సత్యానారాయణపురం, మాపాక్షి తదితర ప్రాంతాల్లో చవితి సంబరాలు అంబరాన్నంటాయి.

ఆకట్టుకుంటున్న వినాయకులు..

- చిత్తూరు నగరం వేపమానువీధిలో కొలువుదీరిన వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ధర్మయాత్రలో వినాయకుడు విహరిస్తున్నట్లు కొలువుదీరారు.
- ఏటా లాగే వన్నియర్ బ్లాక్‌లో ఈసారి కూడా వినూత్న రీతిలో కొలువుదీర్చారు. చిన్న మండపంలో వినాయకుడు మురుకులు కాలుస్తున్నట్లు, ఎలుక మురుకులకు పిండి వదులుతున్నట్లు రూపొందించారు. ఈ ప్రతిమ భక్తులను ఆకట్టుకుంటోంది. అలాగే గురప్పనాయుడులో కొలువుదీరిన బాలగణనాథుడు చూడముచ్చటగా కనువిందు చేస్తున్నాడు. దొడ్డిపల్లిలో 40 అడుగుల ఎత్తులో మట్టి జయ జయవినాయకుడు విశేష పూజలందుకుంటున్నాడు.

వినాయకుడి సేవలో విజయానందరెడ్డి..

మిట్టూరులో జరిగిన చవితి వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కార్పొరేటర్ ఆయనకు ఘనస్వాగతం పలికారు.

నిమజ్జనానికి కట్టమంచిలో ఏర్పాట్లు

కట్టమంచి చెరువులో నిమజ్జనం చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. చెరువులోకి బొమ్మలను దింపేందుకు క్రేన్‌లను అందుబాటులో ఉంచారు.

యాదమరిలో..

యాదమరి: వినాయక చవితి పర్వదినాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విద్యుత్ దీపాలంకరణలో మండపాలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో వాడవాడలా మండపాలను సిద్ధం చేసి, మంగళ తోరణాలు, విద్యుత్ దీపాలతో వినాయకుని విగ్రహాలను కొలువు దీర్చారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలో వాడవాడల చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో కొందరు ఇళ్లలోనే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని పల్లెల్లో వినాయక చవితి సంబరాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఐరాలలో..

ఐరాల: మండలవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



దొడ్డిపల్లిలోని 40 అడుగుల భారీ వినాయకుడు



గుడిపాల: వసంతాపురం గ్రామంలో



బంగారుపాళెం మేదర వీధిలో..



తవణంపల్లె: దిగువ మోదలపల్లెలో వినాయకుడికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఐరాల: వీఎస్ అగ్రహారంలో కొలువుదీరిన గణనాథుడు

అర్ధగిరి క్షేత్రంలో దేవదాయశాఖ మంత్రి పర్యటన



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని వినాయక చవితి సందర్భంగా బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రాంనారాయణరెడ్డితో పాటు దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమౌళి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఎండోమెంట్ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ రాజన్, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ సుగుణాకర్ రెడ్డి, ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్ చిట్టెమ్మ స్వామికి అభిషేకం, అర్చనలు చేయించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు మంత్రికి, ఎమ్మెల్యేకి, కమిషనర్‌కు కండవాలు వేసి, స్వామి వారి తీర్థప్రసాదాలు, సంజీవరాయ పుష్కరిణి తీర్థం, ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేసి ఆశీర్వదించారు.

క్యాన్సర్ వ్యాధిని గుర్తిద్దాం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ తెలిపారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఎన్‌సీడీ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది వరకు ఎన్‌సీడీ సర్వేతో క్షేత్రస్థాయిలో పలు రకాల క్యాన్సర్ లక్షణాలను గుర్తించేవారన్నారు. క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలోని సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌సీడీ 4.0ను క్వాలిటీగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు.